# ప్రాణాలు తీస్తున్న గుంతల రోడ్లు


వరిదనం వెళ్లే రోడ్డులో లయన్స్ నగర్ వద్ద ప్రమాదకరంగా..


పాలకొల్లు నుంచి భీమవరం వెళ్లే రోడ్డులో పూలపల్లి రైస్‌మిల్లు వద్ద రోడ్డు దుస్థితి

- ఇటీవల గోతుల్లో పడి ప్రాణం కోల్పోయిన ఇద్దరు
- పాలకొల్లు నియోజకవర్గంలో రోడ్లు అధ్వానం
- రాకపోకలకు బెంబేలెత్తిపోతున్న వాహనచోదకులు

**పాలకొల్లు సెంట్రల్:** రహదారులు ప్రమాదాలకు నెలవుగా మారాయి. రోడ్డుపై గోతులను గుర్తించేలోపే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు నెలల క్రితం పాలకొల్లు నియోజకవర్గం పోడూరు మండలం పెనుమదం రోడ్డుపై ఓ మహిళ రాత్రి సుమారు 7 గంటల సమయంలో పాలకొల్లు నుంచి పెనుమదం వైపు ప్రార్థనకు ద్విచక్ర వాహనంపై చర్చికి వెళుతూ రోడ్డు మధ్యలో ఉన్న గోతిలో పడింది. తలకు తీవ్రమైన గాయమవడంతో అమె అక్కడికక్కడే ప్రాణం కోల్పోయింది. 20 రోజుల క్రితం ఓ వ్యక్తి రాజమండ్రి నుంచి ద్విచక్ర వాహనంపై నరసాపురం తన ఇంటికి వెళుతుండగా పాలకొల్లు నుంచి నరసాపురం వెళ్లే రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం దాటిన వెంటనే గోతిలో పడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆయన మృత్యువాత పడ్డాడు.


టౌన్ ఆసుపత్రి వద్ద రోడ్డుపై ఉన్న గొయ్యి

**చిన్న చిన్న గోతులు పెద్ద ప్రమాదాలు**

గోతులు, రాళ్లు లేచిపోవడం వల్ల ద్విచక్రవాహనాలు స్కిడ్ అయ్యి ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్న చిన్న గోతులే పెద్ద పెద్ద ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వర్షాకాలంకావడంతో రోడ్డు గోతులు వర్షం నీటితో నిండిపోతున్నాయి. ఇవి చిన్నవో పెద్దవో తెలియక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నిచోట్ల గోతులు పూడ్చడంతో ఆ ప్రాంతం రోడ్డు ఎత్తుగా ఉంటుంది. అవి కూడా వాహనచోదకులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. గోతులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గోతులు పూడుస్తున్నారని, అలా కాకుండా ఆ ప్రాంతం అంతా రోడ్డు నిర్మిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని వాహనచోదకులు సూచిస్తున్నారు.

**ఆర్భాటమే**

రోడ్లు మరమ్మతులు కూడా కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభోత్సవాలు చేయడం గమనార్హం. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో మూడు నాళ్ల ముచ్చటగానే తయారైంది. మరమ్మతులు చేసిన రోడ్లు కొద్దికాలానికే పాడవుతున్నాయి. పాలకొల్లు నుంచి భీమ వరం వెళ్లే రహదారి, పాలకొల్లు నుంచి నరసాపురం వెళ్లే రహదారి చాలా అధ్వానంగా ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రచారార్భాటాలు కాకుండా ప్రజల ప్రాణం దృష్టిలో పెట్టుకుని రోడ్డు నిర్మాణా ల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వాహనచోదకులు కోరుతున్నారు.


పెనుమదం రోడ్డులో మృతి చెందిన మహిళ (ఫైల్)


వరిదనం నుంచి పెదమామిడిపల్లి వెళ్లే రోడ్డు దుస్థితి


పాలకొల్లు - నరసాపురం రోడ్డులో గోతులు


పెనుమదం రోడ్డు రైస్‌మిల్లు వద్ద ప్రమాదకరంగా ఉన్న చిప్స్

# దంచి కొట్టిన వర్షం


పెనుమంత్ర : చెరువులా మారిన నౌడూరు, పాలమూరు మధ్యలో ఆర్అండ్‌బీ రోడ్డు


పెనుగొండ: ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిలిచిన నీరు


పెనుగొండ: వీధుల్లో నిలిచిన నీరు


పెనుమంత్ర : బ్రాహ్మణచెర్వు జుత్తిగ గోస్తనీ కెనాల్ ఆర్అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

**పెనుగొండ:** అల్పపీడన ప్రభావంతో ఆచంట నియోజకవర్గంలో మంగళవారం ఉదయం భారీ వర్షం దంచికొట్టింది. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఎడతెరపి లేకుండా కురుస్తునే ఉంది. జనజీవనం స్తంభించింది. విద్యార్థులు వర్షంలో తడుస్తూనే పాఠశాలలకు వెళ్లారు. పెనుగొండ, వడలి, సిద్ధాంతం, నడిపూడి, చినమల్లం, దేవ కాలనీ ల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయం, బస్టాండు వద్ద, రాజీవ్ సెంటర్, శివాలయం వీధి, వంతెన వీధి, చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఉరుములతో కూడిన వర్షం కురుస్తుండడంతో ప్రజలు హడలిపోయారు. మధ్యాహ్నం నుంచి తెరిపివ్వడంతో ప్రజలు ఊపిరి పీల్చుకొన్నారు. చెరుకువాడ, యర్రా నారాయణ స్వామి కాలనీ, కోడిపందేల దిబ్బ కాలనీ, దొంగగూడెం కాలనీల్లో రోడ్ల పైకి నీరు చేరడంతో దుర్వాసన వెదజల్లింది. కాలనీ వాసులు ఇబ్బందులకు గురయ్యారు. సమస్యను పరిష్కరించాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

**రోడ్లు అధ్వానం**

**పెనుమంత్ర:** రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెనుమంత్ర మండలంలో కాలనీలు, రోడ్లు, అధ్వానంగా మారాయి. మండలంలో మంగళవారం 59.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం ఉదయం నుంచి ప్రారంభమైన వర్షం మంగళవారం మధ్యాహ్నం వరకు కురిసింది. దీంతో పల్లపు చేలు నీట మునిగాయి. రోడ్లు ఛిద్రంగా మారాయి. ఇప్పటకే ఉన్న గోతులు పెద్దవి కావడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. నౌడూరు, పాలమూరు, బ్రాహ్మణచెర్వు – జుత్తిగ ఆర్అండ్‌బీ రోడ్లలో వర్షం నీరు గోతుల్లో చేరి అధ్వానంగా మారాయి.

## ఘనంగా ఓజోన్ పరిరక్షణ దినోత్సవం

**నరసాపురం:** ఓజోన్ పొర పరిరక్షణకు కృషి చేయాలని వైఎన్ కళాశాల కళాశాల పిన్సిపాల్ సీహెచ్ కనకారావు అన్నారు. మంగళవారం కళాశాలలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని కళాశాల సామాజిక సేవా విభాగం, జాగ్రఫీ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సూర్యుడి నుంచి ప్రమాదకరమైన అతినీలలోహిత కిరణాలను నేరుగా భూమిపై పడకుండా ఓజోన్ పొర రక్షిస్తుంటుందని చెప్పారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణాన్ని తద్వారా ఓజోన్‌పొరను కాపాడుకోగలమని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.రంగారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, సామాజిక సేవా యూనిట్ సమన్వయకర్త భీమడోలు ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారులు యాకోబ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

**ఏఎస్ఎన్ఎం కళాశాలలో..**

**పాలకొల్లు సెంట్రల్:** సూర్యరశ్మి లేనిదే భూమిపై జీవం సాధ్యం కాదని కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక ఏఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఓజోన్ రక్షణ పొరను కాపాడుకోవాల్సిన భాద్యత మనందరిపైనా ఉందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపకులు యామిని, భద్రాచలం, బూసి వెంకటస్వామి, రామకృష్ణ, ఎం దివ్య, పి.శ్రీనివాసరావు, వి.శిరీష, జీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం

**పాలకొల్లు సెంట్రల్:** పేద విద్యార్థి కడియాల నాగమల్లేశ్వరరావుకు విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. పోడూరు మండలం జిన్నూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి విజయనగరం మహారాజా వైద్య కళాశాల లో ఎంబీబీఎస్ సీటు సాధించిన నాగమల్లేశ్వరరావుకు సాయం అందించారని, నాలుగేళ్లపాటు రూ.20వేల చొప్పున అందజేస్తామని హామీ ఇచ్చారని సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ తెలిపారు. సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.


విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

## సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎంపిక


సచివాలయం నూతన కార్యవర్గం సభ్యులు

**యలమంచిలి:** మండలంలోని సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికయింది. అధ్యక్షుడిగా గొల్ల శ్రీసాయికాంత్, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.కార్తీక్ కుమార్, సెక్రటరీ ఎం ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.భార్గవ ట్రెజరర్ ఎల్ శైలజ, ఆరుగురు ఉపాధ్యక్షులు, ఆరుగురు సంయుక్త కార్యదర్శులు, ఆరుగురు ఈసీ మెంబర్లుగా ఎన్నికయ్యారు. వీరికి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్ శుభాకాంక్షలు తెలిపారు. ఏపీజీఈఏ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు షేక్ ఉమార్ ఆలీషా ముఖ్యఅతిథిగా, జిల్లా అధ్యక్షుడు వై.మోహనరావు, జీఆర్ఎస్ఎన్ రాజు, జిల్లాజాయింట్ సెక్రటరీ సి.రాజేష్, యుగంధర్, ప్రశాంత్‌బాబు, నాగలక్ష్మి, సునీల్ పాల్గొన్నారు.

## శ్మశాన వాటికలో చెత్త డంప్‌ను అరికట్టాలి

**పెనుమంత్ర:** సత్యవరం గ్రామ పంచాయ తీ పరిధిలో ఉన్న వెలగలేరు శ్మశాన వాటిక స్థలాన్ని డంపింగ్ యార్డుగా వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని సత్యవరానికి చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెలగలేరులో కొంత స్థలాన్ని గ్రామస్తులు శ్మశాన వాటికగా వినియోగిస్తున్నారని, ఇందులో చెత్తను డంప్ చేయడం వల్ల సత్యవరం గ్రామానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గెడ్డం ఈశ్వరుడు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తమనంపూడి పల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బంగారురెడ్డి, పాలా శ్రీను, దొంగ గోవిందు, శ్రీనివాస్, టి.సూర్యారెడ్డి, కె.వెంకటరత్నం, వీరవల్లి స్వామి, టి.చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు టీకాలు వేయించాలి

**యలమంచిలి:** వర్షకాలంలో గాళ్ల కుంటు వ్యాధి రాకుండా పశువులకు వ్యాక్సిన్ వేయించాలని మండల పశు వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి కోరారు. దొడ్డిపట్ల గ్రామంలో మంగళవారం ఆయన వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. 31 ఆవులు, 102 గేదెలకు వ్యాక్సిన్ ఉచి తంగా వేశారు. ఏనుగువానిలంక గ్రామంలో బుధ వారం వ్యాక్సిన్ వేస్తామని ఆయన వివరించారు.

### క్లుప్తంగా

## వాసవీ మాత సేవలో సిద్ధిపేట వాసులు


వాసవీ శాంతి థాంలో సిద్దిపేట భక్తులు

**పెనుగొండ:** అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంను తెలంగాణ సిద్ధిపేటకు చెందిన భక్తులు సందర్శించారు. మంగళవారం ఉదయం 102 అడుగులు రుషీ గోత్ర మందిరంలోని 92 అడుగుల పంచలోహ వాసవీ మాత విగ్రహాన్ని మహిళలు ఏకరూప దుస్తుల్లో దర్శించుకొన్నారు. మరకత శిల వాసవీ మాతకు అర్చనలు, అభిషేకాలు చేశారు.

## వివాదాస్పద స్థల పరిశీలన


మల్లవరంలంకలో మాట్లాడుతున్న అధికారులు

**నరసాపురం రూరల్:** వివాదాలకు తావు లేకుండా సోదరభావంతో మెలగాలని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. మల్లవరం పెదలంక గ్రామంలో ఇటీవల వినాయక చవితి సందర్భంగా ఇరుసామాజిక వర్గాల మధ్య ఏర్పడిన వివాదానికి కారణమైన పెదలంక వంట కాలువ గట్టున ఉన్న అంబేడ్కర్ విగ్రహం, రావి చెట్టు ప్రదేశాలను మంగళవారం ఆయన డీఎస్పీ శ్రీవేద, రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇరు వర్గాల వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎస్సై జి.వాసు, తహసీల్దార్ ఐతమ్ సత్యనారాయణ, వీఆర్వో లక్కు వీరాస్వామి, గ్రామ కార్యదర్శి కె.స్వాతి, మహిళా పోలీస్, జి.నాగేశ్వరి, రాజారెడ్డి పాల్గొన్నారు.

## నేటి నుంచి వైద్య శిబిరాలు

**పాలకొల్లు సెంట్రల్:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్యాధికారిణి జి.గీతాభాయ్ తెలిపారు. మంగళవారం మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గీతాబాయ్ సందర్శించి, మాట్లాడారు. మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లాలో అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్త్ సెంటర్లు, జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక నోడల్ అధికారి డీపీఎంఓ ధనలక్ష్మి, డాక్టర్లు ఎం నవ్యజీవన్, జి.దినేష్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

## ఆట వస్తువులు అలంకరణ కోసం కాదు


చిన్నారి బరువు నమోదు చేస్తున్న సుజాతారాణి

**పెనుమంత్ర:** అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన ఆట వస్తువులు అలంకరణ కోసం కాదని ప్రీస్కూల్ పిల్లలకు వినియోగించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ బి.సుజాతారాణి అన్నారు. మంగళవారం ఆమె పెనుమంత్ర మండలం ఎస్ ఇల్లిందలపర్రు-1, -2, జుత్తిగ-3, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లల బరువు, ఎత్తులను ఆమె స్వయంగా పరిశీలించారు. రికార్డుల్లో ఉన్న తప్పుడు నమోదులను సరిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ ఎ.కృష్ణకుమారి, సూపర్‌వైజర్ వి.వరలక్ష్మి, ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలు పి.కనకదుర్గ, టి.చిన్నమ్మ, వి.లక్ష్మి పాల్గొన్నారు.

## పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న 'కూటమి'


గురు ప్రసాద్

**పెనుమంత్ర:** ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరిస్తోందని బహుజన కులాల రాష్ట్ర నాయకుడు చింతపల్లి గురు ప్రసాద్ మంగళవారం ప్రకటనలో ఆరోపించారు. నాడు రెండు రెళ్ల నాలుగు అని నిజం రాసిన ఎన్‌కౌంటర్ పత్రిక ఎడిటర్ పింగళి దశరథ రాముని హత్యచేశారని, నేడు రెడ్ బుక్‌పాలనతో అభివృద్ధి పనుల్లో కుంభకోణాలు చేయడం, దాడులు అత్యాచారాలతో అక్రమ అరెస్టులు చేస్తున్న ఈ ప్రభుత్వ విధానాలను వెలుగులోకి తెస్తున్న సాక్షి పత్రికను నిషేధించాలని కోరుతున్న కూటమి ప్రభుత్వం పత్రికా ప్రతినిధులపై అక్రమ కేసులు బనాయిస్తూ, జైలు పాలు చేస్తున్నారని పేర్కొన్నారు. 16 నెలల కాలంలో అభివృద్ధి సంక్షేమం ఎక్కడా కానరావడంలేదని, కుయుక్తులు, కుతంత్రాలతో పాలన చేస్తూ అమరావతి, పోలవరం అంటూ కాలక్షేపం చేస్తున్న ప్రభుత్వ విధానలోని లోగుట్టును వెలికితీస్తున్న సాక్షిపై కక్ష సాధింపు చేపట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

## డీసీఎంఎస్ చైర్మన్ రాజీనామా చేయాలి


కర్రి గౌరీసుబాషిణీ

**పెనుగొండ:** యూరియా పంపిణీలో అవినీతికి బాధ్యత వహిస్తూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ రాజీనామా చేయాలని పెనుమంత్ర జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పెనుమంత్ర డీసీఎంఎస్ స్టాకు పాయింట్‌లో ఎరువులు, పురుగు మందులు, యూరియా రైతులకు అందకుండా పక్కదారి పట్టాయని, దీనిని వ్యవసాయ శాఖ అధికారులు ధ్రువీకరించారని తెలిపారు. పత్రికల్లో సైతం యూరియా మాయమైనట్టు కథనాలు వచ్చాయని వివరించారు. 25 టన్నులు యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయిందన్నారు. రైతులకు యూరియా అందక ఇబ్బందులు పడుతుంటే జిల్లాలో యూరియాపై అవినీతి జరగలేదంటూ డీసీఎంఎస్ చైర్మన్ ప్రకటించారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో డీసీ ఎంఎస్‌లో అవినీతి జరిగినట్టు సుస్పష్టంగా తెలుస్తుందన్నారు. యూరియా డీసీఎంఎస్ స్టాకు పాయింట్లకు రాకుండానే నేరుగా బ్లాక్ మార్కెట్‌కు తరలి పోతుందని ఆరోపించారు. కొందరు స్థానిక, జిల్లా స్థాయి అధికారులు సైతం ఉన్నారని తెలిపారు. నిజానిజాలు నిగ్గు తెల్చడానికి విచారణ చేయించాలని కలెక్టరుకు ఫిర్యాదు చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట్లో ముంచుతూ, స్కాంలతో లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు.

## రాష్ట్ర పోటీలకు పెనుగొండ విద్యార్థులు


తణుకులో జిల్లా పోటీల్లో ప్రతిభ చాటిన పెనుగొండ విద్యార్థులు

**పెనుగొండ:** తణుకులో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పెనుగొండ భాష్యం విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. తణుకులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 15న నిర్వహించిన అండర్-14, -16, -18, -20 పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. అండర్-14 విభాగంలో త్రైయాతలిన్-ఎలో యుడెన్నీ ప్రేమ్ జిల్లా ద్వితీయ స్థానాన్ని, త్రైయాతలిన్-బిలో ఎంఎస్‌డీడీ శివ జిల్లా ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకొన్నారని తెలిపారు. వీరు సెప్టెంబర్ 27 నుంచి 29 వరకు ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను పలువురు అభినందించారు.